క్లుప్తంగా

పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో రవితేజ

బెజ్జూర్: పత్తి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఈవో రవితేజ అన్నారు. సోమవారం ముంజంపల్లి గ్రామ శివారులో పత్తి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షానికి పత్తి పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 10 గ్రాములు లేదా మల్టీ కే 13 -0 -45 -10 గ్రాములు లేదా 20 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. చీడపీడల ఉధృతి పెరగకుండా కార్బండిజమ్ 2.5 గ్రాములు, మాంకోజెబ్ లేదా పిప్రోనిల్ 2 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

కొనసాగుతున్న బల్దియా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బల్దియా కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సమస్యల సాధన కోసం శాంతియుతంగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వాటర్ సప్లయ్, శానిటేషన్, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు




మాట్లాడుతున్న సీఐ స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: గణపతి నిమజ్జనంలో డీజే సౌండ్‌కు అనుమతి లేదని వన్‌టౌన్ సీఐ బుద్దే స్వామి అన్నారు. కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీజే సౌండ్ సిస్టమ్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణపతి నిమజ్జనంలో డీజేలకు అనుమతులు లేదని, రెండు బాక్సులు కన్న ఎక్కువ బాక్సులు పెడితే యజమానిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ఎస్సై శ్రీకాంత్, డీజే యజమానులు పాల్గొన్నారు.

చాకచక్యంగా డబ్బులు కాజేసిన హోల్‌సేల్ వ్యాపారి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో సినీఫక్కీలో డబ్బులు కాజేసిన హోల్‌సేల్ వ్యాపారిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ వివరాల ప్రకారం పట్టణానికి చెందిన హోల్‌సేల్ వ్యాపారి పంకజ్ అగర్వాల్ గోపాల్ కిరాణాషాపు యాజమాని సుశాంతో సర్కార్‌కు సరుకులు అందజేశాడు. వీటికి సంబంధించిన రూ.50వేలను షాపు యాజమాని ఈనెల 20న పంకజ్ అగర్వాల్‌కు అందజేశారు. అయితే రూ.40 వేలు మాత్రమే ఇచ్చారని మిగితా డబ్బు ఇవ్వాలని పంకజ్ తెలుపడంతో మరో రూ.10వేలు ఇచ్చారు. అనుమానం వచ్చిన షాపు యాజమాని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా పంకజ్ అగర్వాల్ రూ.10 వేలు చాకచక్యంగా కాజేసినట్లు బహిర్గతమైంది. కాగా సోమవారం పంకజ్ అగర్వాల్ నజ్రూల్‌నగర్ మార్కెట్‌కు రాగా వ్యాపారస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సుశాంతో సర్కార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, డబ్బులు రికవరీ చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు కోసం 'ఉన్నతి'



పరిశీలిస్తున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు కోసం ఉన్నతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్నతి ప్రారంభ పరీక్ష నిర్వహించారు. ఎస్‌వో మాట్లాడుతూ 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. హెచ్‌ఎం సుభాష్ పాల్గొన్నారు.

వానొస్తే రాకపోకలు బంద్

- వాగులపై వంతెనలు లేక ఇబ్బందులు
- అత్యవసర సమయాల్లో దాటలేని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఉప్పొంగి ప్రవహిస్తున్న అప్పపల్లి వాగు (ఫైల్)



తెప్పలపై ప్రయాణిస్తున్న గుండి గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు మార్గం, వాగులపై వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని 30 గ్రామాలకు వాగులపై వంతెనలు లేకపోవడంతో వాగు ఉప్పొంగినప్పుడల్లా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వాగు దాటే క్రమంలో పలువురు కొట్టుకుపోయిన ఘటనలు కూడా సంభవించాయి. అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్

మండలంలోని గుండి వాగు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉంది. వాగుపై వంతెన నిర్మాణం ప్రారంభించిన అధికారులు పిల్లర్ దశలోనే వదిలేశారు. దీంతో గ్రామస్తులు వర్షాకాలంలో తెప్పలపై వాగు దాటాల్సి వస్తోంది. అప్పపల్లి, తుంపెల్లి వాగుపై వంతెన లెవల్ తక్కువగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి వాగు ఉప్పొంగి వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తున్నాయి. గత ఆగస్టులో ఈ వాగు దాటే ప్రయత్నంలో ఇద్దరు కొట్టుకుపోగా వారి ఆచూకీ ఇంతవరకు దొరకలేదు. గత సంవత్సరం వెంకటాపూర్ జీపీ పరిధిలోని వాగుదాటుతూ ఓ యువతి మృతిచెందింది. ఇలా అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు మేల్కోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అనేక గ్రామాలకు వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని, తద్వారా అత్యవసర సమయాల్లో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆయా గ్రామాల్లోని వాగులపై వంతెనలు నిర్మించి కష్టాలు తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.

వంతెన పనులు ప్రారంభించాలి



వంతెన నిర్మాణం పనులు ప్రారంభించి పిల్లర్ దశలోనే వదిలేశారు. దీంతో గుండి గ్రామస్తులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

\- కోలే రవీందర్, గుండి

తిప్పలు పడుతున్నాం



చిన్నపాటి వర్షానికి అప్పపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. చదువుకునే విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు. వాగుపై వంతెన ఏర్పాటు చేయాలి.

\- సాంబయ్య, అప్పపల్లి

ఆదివాసీల అభివృద్ధే లక్ష్యం



ఉత్తర్వుల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: ఆదివాసీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం కౌటాలలో తన నివాసంలో సిర్పూర్(టి), బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లో మంజూరైన భవనాల ప్రొసిడింగ్ కాపీలను ఆదివాసీల నాయకులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మూడు మండలాలకు ఒక్కో ఎస్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. బెజ్జూర్ మండలంలోని నాగుల్వాయి గ్రామానికి చెందిన మోర్లె బాపురావు గతేడాది విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి విద్యుత్‌శాఖ మంజూరు చేసిన రూ.10లక్షల పరిహార చెక్కును అందజేశారు. కార్యక్రమాల్లో కౌటాల ఏడీ రాజేశ్వర్, మన్నెవార్ సంఘం నాయకులు సదాశివ్, ధర్మయ్య, రాజు, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు సహజం

కౌటాల: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని గుండాయిపేట్ గ్రామ సర్పంచ్ సునీత అన్నారు. గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గావుడే హన్మంతు బదిలీపై వెళ్లడంతో ఆయనను కాంప్లెక్స్ ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఉప సర్పంచ్ లహంచు పటేల్, సీఆర్పీ రవికుమార్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు రాకేష్ గుప్తా, తిరుపతి, మధుకర్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి పీజీహెచ్‌ఎంగా చంద్రశేఖర్

కెరమెరి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కెరమెరి పీజీహెచ్‌ఎంగా గొల్లపెల్లి చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ మండలం శ్యాంపూర్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన చంద్రశేఖర్ పదోన్నతిపై కెరమెరికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆడే ప్రకాశ్ గోయగాంకు బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

పెంచికల్‌పేట్ హెచ్‌ఎంగా విజయనిర్మల

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలిగా విజయ నిర్మల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

సీనియర్ మేట్‌లను ఎఫ్‌ఏలుగా నియమించాలి

వాంకిడి: గ్రామస్థాయిలో ఉపాధిహామీ పథకంలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమానంగా పని చేస్తున్న సీనియర్ మేట్‌లను నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీల వారిగా ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. నియామకాలు చేపట్టే వరకు రోజువారి కూలీ రూ.272 చెల్లించేలా కృషి చేయాలని కోరారు. రాజ్‌కుమార్, చందు, శ్రీరామ్, ప్రవీణ్, దినకర్, దశరథ్, ఆకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాల్ జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ జనసంఘ్‌కు ఏకాత్మక, మానవతా వాదం అనే సిద్ధాంతాలను దీన్‌దయాల్ ప్రతిపాదించారని పేర్కొన్నారు. నాయకులు శ్రీశైలం, విజయ్, మురళి, కిరణ్, గణపతి, తరుణ్, శ్యాంరావ్, రమేశ్ గౌడ్, నరసింహారెడ్డి, సుధాకర్, కవిరాజ్, బిక్షపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



దహెగాం: సరుకుల వాహనాన్ని అడ్డుకుంటున్న అంగన్‌వాడీలు



రెబ్బెన: అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు

రెబ్బెన: అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు (సీఐటీయూ) అంబాల ఓదెలు అన్నారు. అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు రాజేశ్వరి, చంద్రకళ, బాలమ్మ, ప్రమీల, మంజుల, సింధు, స్వర్ణలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు బొడ్డెమ్మలు తయారు చేసి బతుకమ్మ ఆడారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం జిల్లా కార్యదర్శి గంగామణి, త్రివేణి, జిల్లా కమిటీ నాయకులు జంగుబాయి, అరుణ, వినోద, మల్లేశ్వరి, రజిత, అంబిక, సీఐటీయూ నాయకుడు ఆనంద్, అంగన్‌వాడీలు అనుసయ, అనిత, గుణసుందరి, రాధ, కవిత, బొజ్జుబాయి, సేవంతా, అరుణ తదితరులు ఉన్నారు.

కౌటాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట 15వ రోజు సోమవారం అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, మోక్ష, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని దీక్ష శిబిరాన్ని సీఐటీయూ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకులు ఓదేలు, రాజేశ్వరి, పార్వతి, సుజాత, కమల, తదితరులు పాల్గొన్నారు.

సరుకుల వాహనం అడ్డగింత

దహెగాం: అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు తరలించేందుకు మండల కేంద్రానికి వచ్చిన కార్గో వాహనాన్ని సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ గత 15రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు వజ్రమ్మ, కల్పన, జయ, లక్ష్మి, మమత, పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

దహెగాం: 2వ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మధుకర్ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని లేకుంటే అక్టోబర్ 5వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని 2వ ఏఎన్‌ఎంలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవిత, పీహెచ్‌సీలో వైద్యాధికారికి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సత్యవాణి, లక్ష్మి, శాంత, అనిత, బేబి తదితరులు పాల్గొన్నారు.



దహెగాం: వినతిపత్రం అందజేస్తున్న 2వ ఏఎన్‌ఎంలు

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం పథకంలో పని చేస్తున్న 2వ ఏఎన్‌ఎంలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రచార కార్యదర్శి ప్రమీల, ఏఎన్‌ఎంలు తులసీ, వనిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: సమ్మె కాలంలో 2వ ఏఎన్ఎమ్‌లకు ఇచ్చిన హామీలు ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రామ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, జిల్లా కార్యదర్శి మొగిలి గౌడ్, మండల అధ్యక్షుడు బి.రవి, ఏఎన్‌ఎంలు భారతి, కళావతి, సుశీల తదితరులు పాల్గొన్నారు.


లంబోదరుడికి ఘనంగా పూజలు

రెబ్బెన: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లంబోదరుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గోలేటిలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి సోమవారం పద్మశాలీ మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. నంబాలలో గంగపుత్ర గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మహిళలు కుంకుమ పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో ఓం సాయి గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై చంద్రశేఖర్‌ను మండలి సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు మోడెం సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, నవీన్‌జైస్వాల్, అవిడపు గోపి, ఉమేశ్, అశోక్, రాజేశ్, నర్సింగరావు, సాయికుమార్, రాహుల్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: గణేశ్ శరన్నవరాత్రులను పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలో భగత్‌సింగ్ రోడ్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడిని సోమవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు దర్శించుకున్నారు. గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనం వడ్డించారు. ఆయన వెంట యువ నాయకులు కోనేరు ఫణి తదితరులు ఉన్నారు.

అన్నదాన కార్యక్రమం..

కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో గల శ్రీ వాసవి గణేశ్ మండపంలో సోమవారం ప్రముఖ వ్యాపారి పాలెపు మురళీధర్ -సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళ సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవీమాత ఆలయంలోని గణేశ్ మండపంలో వినాయకుడికి మహిళలు పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు.

జైనూర్: మండల కేంద్రంలోని పవర్‌హౌస్ కాలనీ గణేశ్ మండలి వద్ద సోమవారం నిర్వహించిన సామూహిక కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. మహిళలు మంగళహారతులు పూర్ణకుంభాలతో హజరై పూజలు నిర్వహించారు. కులకర్ణి పండిత్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. మండలి అధ్యక్షుడు ఆడే గోపాల్, నిర్వాహకులు పోలిపెల్లి నరేందర్, దేవిదాస్, ఆడ గోవింద్‌రావు, రామారావు, జనార్దన్, దేవురావు, సందీప్, పద్మారావు, పెంటన్న, చిన్నాజీ, ప్రకాష్, గోరఖ్‌నాథ్, సతీష్, గంగాధర్, బాలాజీ, తదితరులు ఉన్నారు.



రెబ్బెన: గోలేటిలో కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



కాగజ్‌నగర్‌టౌన్: వినాయకుడిని దర్శించుకుంటున్న జెడ్పీ వైస్‌చైర్మన్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. పట్టణంలోని ఆలయాలు, వివిధ కూడళ్లు, కాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం స్థానిక శారదా గణేశ్ మండలి, పోచమ్మ వీధిలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద అన్నదానాలు చేపట్టారు. శారదా గణేశ్ మండలి వద్ద అర్చకుడు రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, కమిటీ ప్రతినిధులు పుల్లూరి రవీందర్, సిద్దంశెట్టి అశ్విన్, మహేశ్, వివేక్, రంజు, బాబుగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దూరప్రాంతాల విద్యార్థుల కోసమే బస్సు సౌకర్యం

రెబ్బెన: దూర ప్రాంతాల నుంచి సింగరేణి పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం యాజమాన్యం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిందని డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలకు కేటాయించిన నూతన బస్సు సేవలను సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు ఆర్లారెడ్డి, పీఈటీ భాస్కర్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ ద్వారా బాధితుడికి చేయూత

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన అరికిల్లమూర్తి అనారోగ్యానికి గురి కాగా ఆసుపత్రి ఖర్చుల కోసం ఎమ్మెల్యే ఆత్రం సక్కు రూ.2.5లక్షల ఎల్‌వోసీ అందించారు. ఇటీవల చికిత్స పూర్తి చేసుకొని మండల కేంద్రానికి వచ్చిన మూర్తిని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీటీసీ మదునయ్యలు పరామర్శించారు.

'ఆశ'లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కౌటాల: ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు మోరేశ్వర్, నాగేశ్, బానీత్, రాజారం, ఆశలు మొగ్ర, లక్ష్మి, కాంత పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: డిమాండ్ల సాధనకు పెంచికల్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలకు సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి సోమవారం మద్దతు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగించొద్దు

కౌటాల: ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని కౌటాల సర్పంచ్ వొజ్జల మౌనిశ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం వారసంతలో వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ముత్తంపేట సర్పంచ్ ఆదే శ్రీనివాస్ ఉన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి గ్రామంలో సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని చెత్తను తొలగించారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉండాలి

రెబ్బెన: ఓటు వేసే యంత్రాలపై ప్రతి ఒక్క ఓటరు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ ప్రేంకిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్, వంకులం, నవేగాం గ్రామ పంచాయతీల్లో ఈవీఎం, వీవీ ప్యాట్స్‌పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచులు జగన్నాథం, మాధవి, ఎంపీటీసీ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

కాగజ్‌నగర్‌రూరల్: అసాంఘిక శక్తులకు ఎలాంటి సహకారం అందించొద్దని సీఐ నాగరాజు అన్నారు. మావోయిస్టు వారోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత గ్రామం రేగులగూడలో తనిఖీలు చేపట్టారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించి వాహనాల అనుమతి పత్రాలు పరిశీలించారు. ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి

బెజ్జూర్: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేయాలని జీసీడీవో శకుంతల అన్నారు. మండల కేంద్రంతో పాటు కుంటలమానెపల్లి, సలుగుపల్లి ఆశ్రమ పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుబాయి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులకు పండ్లు పంపిణీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ రైతులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘ కార్యాలయంలో యూరియా పంపిణీ జరుగుతున్న సందర్భంగా గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఉదయం నుంచి వేచిఉండడంతో పండ్లు పంపిణీ చేశారు.

పరమేశ్వరుడిని దర్శించుకున్న డీఎస్పీ దంపతులు

రెబ్బెన: మండలంలోని నంబాలలో గల ప్రసన్న పరమేశ్వరుడిని సోమవారం ఆసిఫాబాద్ నూతన డీఎస్పీ ఎం.వెంకటరమణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దంపతులను సన్మానించారు. నంబాల సర్పంచ్ సోమశేఖర్, సభ్యులు రాజన్న, సంతోష్, సాయి, రవి పాల్గొన్నారు.

మాలి సంఘం షెడ్లు ప్రారంభం

కెరమెరి: మండలంలోని ఖైరీ, ఇంద్రానగర్ గ్రామాల్లో సోమవారం మాలి సంఘం షెడ్లకు సంఘం ఆసిఫాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి లెండుగురే బాలాజి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. పటేల్ నాగోసే బుదాజి, మొహర్లే జున్నా, గుర్నులే ఏమిజా, కొట్రంగే దయాకర్ తదితరులు ఉన్నారు.